# 4.

# జనన మరణ చక్రము - విముక్తి

**కానిదిదియని చెప్పంగ గలరు గాని**
**బ్రహ్మమిదియని చెప్పంగ వశము కాదు**
**సత్యనిత్యంబు జ్ఞానమనంతమైన**
**అదియె బ్రహ్మంబు వాక్కున కలవి కాదు.**

పవిత్రాత్మ స్వరూపులైన విద్యార్థులారా!

మానవుడు తలంచునది ఒకటి, అందుకొనునది మరొకటి. ఇందులో మానవుని జీవిత సైకతలపై ఊహాగానములుగా నిర్మించుకున్న పిచ్చుక గూళ్ళవంటి మనయొక్క భావము ఏదో పెనుగాలిగా మనకు విరుద్ధమైన భావములు చెలరేగి తద్వారా మనయొక్క తలంపులకు నేలరాల్చేటువంటి పరిస్థితికి కూడను పూనుకుంటాయి. జీవితమే ఒక దీర్ఘమైన మాల వంటిది. అది జనన మరణములనే రెండు కొనలతో చేరినటువంటి హారముగా తయారై, ఈ హారమునకు మధ్యలో కొన్ని కలలు, కలతలు, కల్లోలములు, అశాంతులు, దుఃఖములు, ఆనందములు అనే పుష్పములచేత గుణింపబడి వుంటుంది. అయితే జీవితమునే మాలగా భావిస్తామా లేక దేహము యొక్క సంబంధమే ఒక మాలగా విశ్వసిస్తామా అనే విషయము మనము నిర్ణయము చేసుకోవాలి. ఈ జనన మరణములనే రెండు కొనలను చేర్చే పరిస్థితి మనము విశ్వసించినపుడు జనన మరణములు దేహమునకే గానీ జీవునకు కాదని మనకు స్పష్టమవుతూ వస్తున్నది. కనుక కష్టనష్టములు, సుఖదుఃఖములు బాధలు, కలలు, కల్లోలములు యివన్నీ దేహమునకు సంబంధించినవే కాని, జీవునకు సంబంధించినవి కావనే సత్యము స్పష్టమవుతుంది. దేహమునకు అనేక పరిణామములు కలుగుతున్నవిగాని ఆత్మకు ఎట్టి పరిణామము ప్రాప్తించదు. అయితే ఆత్మ నిత్యమై, సత్యమై, నిర్మలమై, నిస్వార్థమై ఆనందమయమైన స్వరూపాన్ని తాను నిరూపణగా ప్రదర్శిస్తుంది. నిజముగా ఈ దేహమందు బాల్యము, యవ్వనము, కౌమారము, వార్ధక్యము అనేటువంటి దశలు దీనికి కలిగి ఉండటంచేత యీ దశలను పురస్కరించుకొని ఈ దేహము



sri sathyasai vachanamrutam

తాను చేయు పనులు కూడను కొన్ని రకములైన మార్పులు సంభవిస్తుంటాయి. బాల్యావస్థయందు ఆటలు, పాటలు, చదువులు, సంధ్యలు, సంతోష సంబంధమైన ఉల్లాసములు కూడను అనుభవిస్తుంటాడు. బాల్యావస్థయందు తన భవిష్యత్తు గురించి ఏమాత్రము యోచించక, చింతించక, పరితపించక తనయొక్క జీవితమును ఏదో ఒకవిధమైన ఊహాగానంగా అనుభవిస్తుంటాడు. ఈవిధమైన స్థితియందు తాను జగత్తునే మరచియున్న కాలములో తన సంకల్పములకు మీరినట్టి యవ్వనత్వము అందులో ప్రాప్తిస్తుంది. ఈ యవ్వనత్వము ప్రవేశించిన రక్షణమే కన్నూ మిన్నూ కానక గర్వాంధుడై నీతి నిజాయితీ, గౌరవము అగౌరవము, మాన మర్యాదలను మంటగలిపి యేదో తన యొక్క జీవితములో అనుభవించు కునే ప్రయత్నమునకై తన జీవితమును అంకితము చేసి తన బుఱ్ఱను వెఱ్ఱిగా చేసుకొని వెఱ్ఱి భావములతో వెఱ్ఱి తలంపులతో తనయొక్క జీవితమును వ్యర్థము గావించుకునే మార్గములో ప్రవేశింపజేస్తాడు. ఈవిధమైన విషయానందములో తికమకలు పడుచున్న సమయములోనే కౌమారము అందులో ప్రవేశిస్తుంది. ఇట్టి కౌమారము ప్రవేశించగనే బాధ్యతలు, తన భారముగానిల్చిన సంసార కృత్యములు, తన కర్తవ్య కర్మలు అనేకరకములైన వాటిలో బంధింపబడి తాను యేదో ఒకవిధమైన ప్రత్యేకమైన ప్రపంచములో నుండినట్టుగా చింతించటానికి ప్రయత్నిస్తాడు. ఏదో ఒకవిధమైన శక్తి తనను బంధించినట్లుగా విశ్వసించి ఆ బంధనలో నుండి తాను తప్పించుకోటానికి తగిన ప్రయత్నము చేసే సంకల్పముతో మానవుడు అనేక రకములైన యోచనలు సల్పుతుంటాడు. ఇట్టి అవస్థలో తాను అయోమయ స్థితియందున్న సమయమునందే వృద్ధాప్యము ప్రవేశిస్తుంది. కన్నులు మసకలు పడటము, కాళ్లు నడవటానికి వీలుకాకపోవటము, చెవులు వినిపించకుండా పోవటము, చేతులు అదరటము, తనయొక్క విషయములో గడచినటువంటి దానిని చింతించుకుంటూ యింక తన జీవితము ఏవిధమైన అవస్థలకు గురౌతుందో అనే స్థితిలో జీవితాన్ని ప్రవేశపెడతాడు. బాల్య యవ్వన కౌమార వార్ధక్యములయందు ప్రపంచ సంబంధమైన విషయములలో తాను చింతించటానికి కావలసినంత కాలము చిక్కినప్పటికిని, భగవచ్చింతన చేయటానికి మాత్రము యీ వృద్ధునికి కాలము చిక్కకుండా ఉంటుంది. మానసిక శాంతి ఏవిధమైన మార్గమునందు నాకు లభిస్తుంది, ఆత్మసంబంధమైన ఆనందము నాకు ప్రాప్తిస్తుందా అనే విచారణ ఆ వృద్ధునియందు శూన్యమై కేవలము తనయొక్క జీవితములో గడపినటువంటి,

గడచబోవునటువంటి వాటికై తాను చింతించుచు జీవితమును అంత్యమొనరించుకుంటాడు. మానవుడు జన్మించటము, వృద్ధి నొందటము, క్షీణించటము, గతించటము ఇంతేనా మానవ జన్మకు అర్థము? పరార్థము లేదా? లేక పవిత్రమైన జీవితము కాదా అనే విషయమును ఎవ్వరూ విచారించటం లేదు.

**బాల్యంబునందున పలువురితో కూడి**
**ఆటపాటలయందు ఐక్యుడగును**
**యవ్వనంబరుదెంచ నలరు విల్తుని బోలి**
**కామినీలోలుడై క్రాలుచుండు**
**అర్థవయస్సున ఐహికమందున మున్గి**
**ధనమునార్జించుట దగిలియుండు**
**ముదిమివచ్చినయంత మురహరిని తలువక**
**అదియిది లేదని అలమటించు**
**వివిధ దుర్వ్యసనంబులు వీడలేక**
**ముక్తిమార్గంబు వెదకు ఆసక్తిలేక**
**కర్మ పంకిలమునబడి గ్రాలుచుండు**
**మట్టిగల్పును జన్మంబు మానవుండు**

యువకులైన వ్యక్తులు దైవముపైన విశ్వాసము కుదరక దైవము కలదా లేదా అనే సందేహావస్థలోపల తాను కొంత భ్రాంతిని పడుతుంటాడు. ఈ భగవద్విశ్వాసము కూడను జన్మాంతర విశ్వాసమున్న వారికే లభిస్తుంది గాని అందరికి లభించటానికి సాధ్యము కాదు. ఈ జన్మాంతరమనేది కూడను ఈనాడు భారతీయులు విశ్వసించ లేకపోతున్నారు. ఒక చిన్న ఉదాహరణము. జన్మించిన తక్షణమే కొంతమంది కవులుగా తయారౌతున్నారు. కొంతమంది గాయకులుగా అభివృద్ధి అవుతున్నారు. మరికొంతమంది కళాకారులుగా అభివృద్ధి అవుతున్నారు. ఈవిధముగానే జన్మించిన తక్షణమే వారికి యిట్టి ప్రాప్తి, యిట్టి అభిరుచి హృదయమందు చేరటానికి ఎవరి యొక్క ప్రాక్టీసు, ఎవరియొక్క తర్ఫీదు. తన జన్మాంతర వాసనయే యిట్టి అభివృద్ధులకంతా మూలకారణంగా ఉంటుంది. దీనికి వారి వారి శ్రద్ధఅని మీరు వాదింతురేమో, కాని అట్టి శ్రద్ధకల్గినవారు నిత్యము రెండు వేళలయందు కూడను అభ్యాసములు సలుపుతున్నప్పటికి వారికి యిట్టివి అభ్యసించటానికి అవకాశము లభించకుండా, మరికొంతమందికి పుట్టిన తక్షణమే యిట్టి కళలు

srisathyasaivachanamrutam

ప్రాప్తించటానికి వున్న వ్యత్యాసమేమిటో మీరు యోచించుకోవచ్చు. కనుక భారతీయులు కర్మఫలము, పునర్జన్మము మరియు జీవితములో జన్మాంతర సంస్కారము అనే మూడింటితో కూడిన విశ్వాసముతో కూడినవారు. నవీన నాగరికత అభివృద్ధి గాంచటం చూచినప్పుడు కేవలము భగవంతునికి నాకు ఉన్న సంబంధము ఏమిటి? భగవంతుని ప్రార్థించ వలసిన అవసరము ఏమిటి? భగవంతునివల్ల మనకు లభించే సుఖము ఏమిటి? ఈరీతిగా కూడను యువకులు వాదిస్తూ కేవలము అన్నియు కూడ సైంటిస్టుల వల్ల ఈ జగత్తును కావలసిన రీతిగా మార్చుకోవచ్చునని వారు భావిస్తున్నారు. కనిపించని భగవంతుని విశ్వసించటం ఒక బలహీనతని ఈనాడు యువకులు పోట్లాడుతున్నారు. అయితే కనిపించని భగవంతుని విశ్వసించటము బలహీనతగా భావించినప్పుడు కనిపించని అనేక వస్తువులపైన వారు విశ్వాసముంచుకోవటము ఎటువంటి బలహీనతో వారు యోచించుకోలేకపోతున్నారు. ఈనాడు సైంటిస్టులు కూడను స్పర్శను పురస్కరించుకొని గాలిని నిరూపణ సల్పుతున్నారేగాని, గాలిని పట్టి చూడటానికి వీలవుతున్నదా! ఆకాశమునందు సంచరించుచు, మన మాటలలో శబ్దాన్ని విశ్వసించికూడను ఆకాశమును చూడగలుగుతున్నారా? అనేక రకములైన కలతలు తన మనస్సును అనేక విధములైన కల్లోలములు గావించినప్పుడు మనస్సు స్థిమితములేదని, లేక నా మనస్సు ప్రశాంతిగా ఉందని వారు పలుకుతున్నారేగాని, మనస్సును చూడగలుగుతున్నారా? నా హృదయము ప్రశాంతంగా ఉందని లేక అశాంతిగా ఉందని ఉచ్చరించగలిగిన వ్యక్తి తన హృదయమును చూడగలుగుతున్నాడా? ఈనాడు నా శిరస్సు చాలా బాధిస్తున్నాది అని పలకటము లోపల శిరస్సు బాధ తన అనుభవమే గాని, శిరస్సు బాధకు ఒక రూపమున్నదా! కనుక ఆనందమునకు గాని, దుఃఖము నకు గాని, విచారమునకు గాని, ఆహ్లాదమునకు గాని, హృదయమునకు గాని, మనస్సునకు గాని యేమాత్రము రూపములు లేవు. లేనటువంటి వాటిని ఎటుల విశ్వసిస్తున్నారు? సర్వవ్యాపియైన దైవత్వములోనున్న ఆత్మతత్త్వాన్ని విశ్వసించటము బలహీనత అనటంలోపల వీరు ఎంత బలహీనులో మీరు యోచించుకోవచ్చు.

srisathyasaivachanamrutam

## పంచ భూతముల యొక్క శక్తి పరిమితం

జగత్తంతయు పంచభూతములయొక్క మిళితము. పంచ భూతములకు కూడను రూపములు లేవు. వాటికి కొన్ని కొన్ని శక్తులు మాత్రమే ఉంటున్నవి. ఇప్పుడు గాలిని తీసుకుందాం. గాలికి రూపము లేదు. ఆ గాలి ఒక బెలూన్‌లో చేరినప్పుడు ఆ రూపము వస్తుంది. అదేవిధముగా అగ్నికి దహింపజేయు శక్తి మాత్రమే ఉన్నది గాని రూపము లేదు. వంకరటింకరగా ఉన్న త్రాడు అగ్నిలో చేరినప్పుడు అగ్ని వంకరటింకరగా కనిపిస్తుంది. అదే త్రాడు గుండ్రముగా నున్నప్పుడు ఆ అగ్ని గుండ్రముగా కనిపిస్తుంది. కనుక అగ్నికి దహింపచేసే శక్తి మాత్రమే ఉన్నది గాని దానికి స్వరూపము లేదు. ఇదే విధముగా ఈ పంచభూతముల యొక్క ఉపమానములు ఆధారము చేసుకున్నప్పుడు పంచభూతముల యొక్క తత్త్వమునకు శక్తులు మాత్రమే ఉన్నవిగాని స్వరూపములు మాత్రము కనిపించటానికి వీలుకాదు. ఈ పంచభూతములకు అతీతమైన పరతత్త్వమే దైవత్వము. మార్పుచెందే ఈ దేహముతో మన చలించే బుద్ధితో భ్రమించే దృష్టితో ఈ సృష్టిని మనము పరికించటం చేతనే మనకు యిన్ని రకములైన సందేహములకు ఒక కారణము ఏర్పడుతుంది. కనుక, మన యొక్క దేహతత్త్వాన్ని మొట్టమొదట విచారించి, తదుపరి దైవతత్త్వములో ప్రవేశించటానికి పూనుకోవటంలో సార్థకత గలదు. దీనిని పురస్కరించుకొని శంకరుని యొక్క శిష్యులు అనేకమంది గుణములను, మనస్సును, ప్రవర్తనను, దేహమును అనేక విధములుగా తూలనాడి అందులోనున్న సత్యస్వరూపము మనకు యేమాత్రము సహాయకారి కాదని, ఈ పంచభూతములకు అతీతమైన పరతత్త్వాన్ని పొందే ప్రయత్నములో ఆత్మాన్వేషణే ప్రధానమైన మార్గాన్ని నిరూపణ చేయుచూ ఈ 'భజగోవిందము'ను పూరిస్తూ వచ్చారు. అందులో ఒక శిష్యుడు

**బాలస్తావత్ క్రీడాసక్తః తరుణస్తావత్ తరుణీ సక్తః**
**వృద్ధాస్తావత్ చింతాసక్తః పరమే బ్రహ్మణి కో-పినసక్తః**
**ఆటలపాటల బాల్యంబాయెను**
**ప్రాయములో ప్రేమాయణమాయెను**
**ముదిమిని చింతలు ముదిరేపోయెను**
**పరబ్రహ్మ కాబట్టక పోయెను**

srisathyasaivachanamrutam

**భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే.**

పగటివేళలో మానవుడు మనస్సు, చిత్తము, బుద్ధి, ఇంద్రియములు, దేహములచేత ఈ జగత్తును అనుభవిస్తూ ఉంటాడు. ఆ సమయమునందు తాను ఒక వ్యక్తిగాను, తనయొక్క రూపనామములను, తనయొక్క సాంప్రదాయములను సంబంధ అనుబంధములను తాను స్పష్టముగా నిరూపణ చేస్తుంటాడు. అయితే స్వప్నావస్థయందు తన దేహము యేవిధమైన కర్మలలో పాల్గొనక తన యింద్రియములు ఏవిధముగా అల్లాడక, తన కన్నులతో ఏవిధమైన పదార్థములు చూడకుండినప్పటికిని తన కలలో నానా ప్రదేశములు సంచరించి, నానా అవస్థలకు తాను గుర్రైనట్లుగా భావిస్తుంటాడు. నానా ప్రదేశములందు సంచరించటము, నానా విషయములందు పాల్గొనటము, అవస్థలకు గురికావటము, స్వప్నములో తాను అనుభవించటం చేత తాను స్వప్నములో నున్నటువంటి తన యొక్క రెండవ దేహము తాను గుర్తించుకోగలుగుతున్నాడా? జాగ్రత్తలో నున్న దేహమునకు, స్వప్నములో నున్న దేహమునకు ఏమాత్రము సంబంధము లేకుండా ఉంటున్నది. కనుక తాను రెండు దేహములతో ఉంటున్నాడు. ఇందులో జాగ్రత్తదేహము తానా? స్వప్న దేహము తానా? ఇంక గాఢనిద్ర యందు తనకు ఏమాత్రము అనుభవము లేక లేచిన తక్షణమే, 'నేను చక్కని గాఢనిద్రను అనుభవించాను' అని తాను చెప్పుచున్నాడు. అయితే ఆ గాఢనిద్రను పరికించినవాడు ఎవడో తాను యేమాత్రమైనా యోచిస్తున్నాడా? ఆ గాఢనిద్రను తెలుసుకున్న వాడెవడో తాను గుర్తిస్తున్నాడా? మైమరచి నిద్రించినటువంటి వ్యక్తి నేను చక్కని నిద్రను అనుభవించాను అని చెప్పటము లోపల ఆచక్కని నిద్రను చూచినవారు ఎవరో ఉండాలి కదా? కనుక, జాగ్రత్త, స్వప్న, గాఢనిద్రయందు కూడను ఉండిన వ్యక్తి తనలోనే ఉండి, తనలోనే గుర్తించుకోటానికి తగిన వ్యక్తిగా తాను రూపొందుతున్నాడు. కనుక జాగ్రత్త, స్వప్న, సుషుప్తులకంతా కూడను అతీతమైన వాడే వ్యక్తి స్వరూపుడుగాని కేవలము దేహముతో బంధించినవాడు మాత్రమే వ్యక్తి స్వరూపుడని విశ్వసించటములో యేమాత్రము అర్థము లేదు.

**నిన్ను నీవు తెలుసుకో – సర్వవిద్యలు హస్తగతమైపోతాయి**

బ్రహ్మ మానసపుత్రుడైన నారదుడు ఒకానొక సమయమునందు సనత్కుమారుని ఆశ్రయించి తనకు జ్ఞానోపదేశము చేయమని ప్రార్థించిన సమయమునందు సనత్కుమారుడు, 'అయ్యా! నీవు సంపాయించిన శక్తి ఏమిటి? నీవు యింత కాలము చేసిన

srisathyasaivachanamrutam

ఘనకార్యము ఏమిటి? ఏవిద్యలో ప్రవీణుడయ్యావు?' అని అనేక విధములుగా ప్రశ్నించాడు. అప్పుడు ఈ నారదుడు, 'నాలుగు వేదములు చదివాను. వేదాంగములైన ఆరుశాస్త్రములను నేను తెలుసుకున్నాను' అని సనత్కుమారునకు జవాబు చెప్పాడు. సనత్కుమారుడు చిరునవ్వు నవ్వుతూ "నాలుగు వేదములు, ఆరుశాస్త్రములు తెలుసుకోవటము చాలా సంతోషమైన విషయమే. కాని నిన్ను నీవు తెలుసుకున్నావా? నారదా!" అని అడిగాడు. నిన్ను నీవు తెలుసుకొనక ఎన్ని శాస్త్రములు, ఎన్ని వేదములు, ఎన్ని ఉపనిషత్తులు, ఎన్ని విధములైన గీతలు నీ తల బుఱ్ఱలో చేర్చుకున్నంత మాత్రమున ప్రయోజనము లేదు. తనను తాను తెలుసుకున్న సమయమునందే సర్వవిద్యలు హస్తగతమైపోతాయి. సర్వజ్ఞానమునకు తాను అతీతమైన స్థానమును అనుభవిస్తాడు. 'అద్వైత దర్శనం జ్ఞానం' ఇట్టి ద్వైవత్వమును నీవు ఏనాడు వదలిపెట్టెదవో ఆనాడే నీకు జ్ఞానము ప్రాప్తిస్తుందని, అతని గురించి అతనికి చెప్పటానికి సనత్కుమారుడు పూనుకున్నాడు.

ఈనాడు యావత్ప్రపంచము కూడను తమను తాము తెలుసుకొనక అనేక రకములైన ఘన కార్యములు సాధించామని, ఈ సైన్సు యొక్క అభివృద్ధిని ఆధారము చేసుకొని అనవసరమైన కార్యములలో తాము కాలిడుతున్నారు. ఆకాశములో సంచరిస్తున్నామని, నక్షత్రములకు ప్రయాణము సల్పుతున్నామని, చంద్రమండలములో మా జీవితమంతా హాయిగా గడుపుతన్నామని ఉచ్చరించటము లోపల వీరి ఘనత కేవలము గాలిమేడలుగా ఎగిరిపోతున్నది గాని, మానసిక శాంతిగాని, తనయొక్క దివ్యమైన తత్త్వమును గాని తాను అర్థము చేసుకోలేని మూర్ఖత్వములో మునిగిపోతున్నారు సైంటిస్టులు. కనుక వేమన చిన్న పదములతో చెప్పాడు.

**ఇంద్రలోకమైన చంద్రలోకంబైన**
**నంది చూడవచ్చు బొందుగాను**
**నందిమీదనెక్కి నయమున చూడరా!**
**విశ్వదాభిరామ వినుర వేమ**

నందినెక్కి చూడమన్నాడు. నంది అనగా మనము కేవలము ఒక bull గా భావిస్తున్నాము. కాని ఇక్కడ నంది అనే పదమునకు బుద్ధినే తాను నందిగా భావించుకున్నాడు. కనుక ఇట్టి బుద్ధిని మనము దూరము చేసుకొని, ఏదో చంద్రమండలము, సూర్యమండలము పోతున్నామంటే, మన బుద్ధితో కలిగే ఆనందము మన యొక్క అంతరాత్మయందు ఉన్నది

గాని ఆకాశములో లేదు. బుద్ధిని మనము చక్కదిద్దుకొని, దేహము యొక్క తత్వాన్ని అర్థము చేసుకొని, దివ్యమైన భగవత్తత్వాన్ని కూడను పరికించటానికి ప్రయత్నము సల్పినప్పుడు అందులో యేమైనా ప్రాప్తిగాని, ఫలితముగాని దక్కటానికి వీలుంటుంది గాని దేహభ్రాంతులు దినదినమునకు మనము పెంచుకుంటూ, బుద్ధి యొక్క నిర్మలత్వాన్ని యేమాత్రము లక్ష్యము చేయక దానికి అనవసరమైన విషయవాసనలనే మాలిన్యమునంటగట్టి మన జీవితములో దైవమా, దైవమా అని దేవులాడితే దయ ప్రసరించదు.

కనుక మొట్టమొదట ఈ జగత్తులో నివసించటానికి పూర్వము శరీరము, మనస్సు, బుద్ధి, చిత్తముల యొక్క తత్వాన్ని ప్రప్రథమములో అర్థము చేసుకోవాలి.

**'జగతిని జీవించువాడు మనుజుడు కావలె మొదట**
**దనుజుల దుష్కృతులెల్ల పొగడుచుండువాడె చవట**
**తనను తాను తెలుసుకొనుట అదియే ముక్తికి ఒక బాట'**

అట్టి తత్త్వములో మన దేహము యొక్క విచారము అత్యవసరమైనదిగా తాను సంకల్పించి శంకరుల యొక్క శిష్యులైన వారిలో ఒకరు ఈ బాల్య, యౌవ్వన, కౌమార, వార్ధక్యములను అతి వికారమైన, విపరీతమైన అర్థములతో ఒక విరుద్ధమును కల్గించే మార్గమును లోకానికి అందించి దేహ త్యాగమునకు ఒక అవకాశము నందించారు. ఎంతకాలము మనము జీవించినప్పటికిని యింకనూ ఉంది, ఏదో వుండి మనము సాధించాలని అనే భ్రాంతి కేవలము వ్యామోహములో అడుగుభాగమని చెప్పవచ్చును. కానీ మనము దేహమున్నంత లోపలనే దైవాన్ని తెలుసుకొని, దేహతత్వాన్ని కూడ కొంత అర్థము చేసుకొని ఈ దేహము దైవమును చేర్చేటువంటి మార్గములో ఒక ఉపాధిగా మనము విశ్వసించటం అత్యవసరం.

**పాంచభౌతికము దుర్బలమైన కాయము ఎప్పుడో విడిచేది ఎరుకలేదు**
**శతవర్షములదాక మితము చెప్పిరిగాని నమ్మరాదామాట నెమ్మనమున**
**బాల్యమందో, ప్రాయమందో, ముదిమియందో లేక ముసలియందో**
**ఊరనో అడవినో ఉదకమధ్యంబునో ఎప్పుడో విడిచేది ఎరుకలేదు**
**మరణమే నిశ్చయము మానవునకు, బుద్ధిమంతుడైన**
**దేహమున్నంతలో తన్ను తా తెలియ వలయు....**



srisathyasaivachanamrutam

తనను తాను తెలుసుకొనక ఎన్ని విచారణలు మనము చేసినప్పటికి యిది కేవలము కాలమును వ్యర్థపరచిన వారమౌతాము కాని మన జన్మలను సార్థకము చేయించుకున్న వారము కాదు. ప్రపంచము అన్ని మూలలనుండి ప్రసరించే పత్రికల న్యూసులనే మనము చూడటానికి మనము ప్రయత్నము చేస్తున్నాము. దేశములో ఏవ్యక్తి, ఏ మార్గములో, ఏవిచిత్రమైన, ఏచిత్రమైనా, ఏ దుఃఖమైనా, ఏ ఆనందమైన విషయాలు ప్రచురిస్తారో అనే దీనిలో వార్తలు వినటానికి మాత్రమే సంసిద్ధులమై వుంటున్నాము. అన్నివైపుల నుండి వచ్చే న్యూస్‌కు నీవు జీవితాన్ని అంకితము చేస్తున్నావు గాని నీ లోపలి నుండి వచ్చేది న్యూసెన్సు అనేటువంటిది నీవు అర్థము చేసుకోటంలేదు. కనుక ఈ జగత్తే ఒక న్యూస్‌పేపరు. ఈ జగత్తనే న్యూస్ పేపరును మనము చూచాము. న్యూస్‌పేపరు వచ్చినప్పుడు మొదటి నుండి కడవరకు చూస్తాము గాని చూచిన పేపరునే నిత్యము చూడటానికి ఏమూర్ఖుడు పూనుకోడు. కనుక, ఈ ప్రపంచమనే న్యూస్‌పేపరును మనము చూచాము. తిరిగి ఈ న్యూస్‌పేపరును నిత్యము చూడటానికి ప్రాకులాడకూడదు. ఈ రోజు న్యూస్‌పేపరు రేపటిదినము వేస్ట్‌పేపరు.

**పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం**

తిరిగి చావటము, తిరిగి పుట్టటము ఈ రకంగా తిరిగి తిరిగి చూసిన న్యూస్‌పేపరునే చూస్తున్నామంటే మనము వేస్ట్‌పేపరు చూసే మూర్ఖులుగా తయారౌతున్నాము. కనుక యిట్టి వేస్ట్‌పేపరు చూడటానికి ఏమాత్రము అంగీకరించకుండా దైవత్వమనే టేస్ట్‌పేపరు చూడటానికి మనము పూనుకోవాలి. కనుక భావములను దైవమువైపు మరల్చే నిమిత్తమై శంకరుల వారు తన శిష్యులను కూడా ఈవిధమైన మార్గములో ప్రవేశింపచేసి ఆనాడు అనేక మందిని భగవత్త్వాన్ని అనుభవించే దివ్యమార్గము లోపల ప్రవేశపెట్టారు. కాన యువకులైన మీరు ప్రప్రథమంలో బుద్ధిని చక్కదిద్దుకొని నిర్మలమైన భావములతో పవిత్రమైన ఊహలతో చిక్కిన అవకాశమును చక్కగా అనుభవించుకొని దైవత్వమనే మధురమైన ఆనందము నందుకొని తద్వారా మీయొక్క జీవితమును యావత్ భారతదేశమునకు అంకితము చేసి తోటి మానవులను ఉద్ధరించటానికి, ధర్మమును పునరుద్ధరించటానికి తగిన ఆదర్శప్రాయులుగా మీరు నిల్చి భారతదేశ సంస్కృతిని తిరిగి నిలబెట్టటానికి కంకణము కట్టుకుంటారనే విశ్వాసముతో యీ సమావేశములో మిమ్ములను

srisathyasaivachanamrutam

చేర్చుకోటం జరిగింది. చేర్చుకున్నంత మాత్రమున సంతృప్తి కానేరదు. ఈ టక్క నెల దినములు కూడను ఈ చెప్పు విషయములను మీరు ఆలకించు విషయములను, మీ హృదయస్థానమునందు చేర్చుకొని, ఆచరణలో ప్రవేశపెట్టి ఆనందమును అనుభవించి తిరిగి మన భారతదేశమునకు సత్కీర్తిని మీరు నిలుపుతారని కూడను నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 23-05-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam